



రంజాన్ వేళలు

ఇఫ్తార్: సోమవారం 6:25(సాయంత్రం)

సెహరీ: మంగళవారం 4:50 (ఉదయం)





విక్టరీ సింబల్ చూపుతున్న మహిళ







బైక్‌పై ఉత్సాహంతో..

జన ప్రభంజనం

- ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తా
- సీమ ప్రాజెక్టులు పూర్తి చేసే బాధ్యత నాది
- కృష్ణా జలాలు ఎత్తిపోసి కర్నూలు జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరిస్తా
- బీసీలకు అండగా టీడీపీ
- ఎమ్మిగనూరు ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు
- భగభగమండే ఎండను సైతం లెక్క చేయని పసుపు సైన్యం

కర్నూలు, మార్చి 31(ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు/ఎమ్మిగనూరు టౌన్/ రూరల్: భగభగమండే ఎండలను సైతం లెక్కచేయలేదు. అధినేత చంద్రబాబు ప్రసంగాన్ని ఆలకించాలని.. మే 13న జరిగే కురుక్షేత్రంలో విజయోత్సవ శంఖారావం పూరించాలని వెల్లువలా తరలి వచ్చిన జనంతో ఎమ్మిగనూరు పురవీధులు జన ప్రభంజనంలా మారాయి. జనమా.. బంతిపూల వనమా అన్నట్లుగా ఎటు చూసినా పసుపు సైనికులే. ఎల్లో సింహాలై సైకో జగన్ విధ్వంస పాలనను అంతం చేసేందుకు అశేష జనవాహినిలా జనం తరలివచ్చారు. ఈ సభ టీడీపీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని తెలుగు తమ్ముళ్లు, ఓటర్లను సన్నద్ధం చేసేందుకు టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ప్రజాగళం యాత్రకు శ్రీకారం చుట్టారు. ఐదో రోజు ఆదివారం ఎమ్మిగనూరులో ప్రజాగళం యాత్ర సాగింది. జన దండ యాత్రగా ముందుకు కదిలింది. ఎటు చూసినా పసుపుజెండాల రెపరెపలే. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. ఓవైపు ప్రజలకు నేనున్నానంటూ భరోసా ఇస్తూ.. మరో వైపు జగన్ పాలన అకృత్యాలను ఎండగడుతూ.. కేంద్ర, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం రానుందని రాష్ట్రాన్ని, రాయలసీమ ప్రాంతం, కర్నూలు జిల్లాను ఏవిధంగా అభివృద్ధి చేయబోతున్నదీ వివరించారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా పేదలను సంపన్నులను చేసే మహోన్నత లక్ష్యాన్ని వివరిస్తూ ఆద్యంతం ఆసక్తిగా చంద్రబాబు ప్రసంగం సాగింది. చంద్రబాబు ప్రసంగిస్తున్నంత సేపు యువత ఉత్సాహంతో సీఎం..సీఎం..అంటూ కేరింతలు కొట్టారు. సైకో పోవాలి.. సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. మండుటెండల్లో సైతం మూడుగంటలు జనం ఓపికతో ప్రసంగాన్ని ఆలకించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, కర్నూలు ఎంపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాడు నాగరాజుల ఆధ్వర్యంలో జరిగిన సభలో చంద్రబాబు ఉత్తేజిత ప్రసంగం కొనసాగించారు. ఆయన ఇలా మాట్లాడారు..

ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నావు?

మద్యం దశల వారిగా నిషేధించి 2024లో మీ ముందుకు ఓట్లు అడిగేందుకు వస్తానని జగన్ మాట ఇచ్చారు. మద్యం నిషేధించకపోగా టీడీపీ ప్రభుత్వంలో రూ.60 ఉన్న క్వార్టర్ మద్యం రూ.200 పెంచారు. రూ.140 ఎవరి జేబులోకి వెళ్లోంది. రోజు ఒక క్వార్టర్ తాగితే ఏడాదికి రూ.30 వేలు, రెండు క్వార్టర్లు తాగితే రూ.60వేలు జగన్ ఖాతాలోకి వెళ్తున్నాయి. జేబులు కొల్లగొట్టడమే కాకుండా ఆరోగ్యం నాశనం అయ్యేలా చేస్తున్నారు. ఆడవారి తాళిబొట్లు తెంచేస్తున్న జగన్ ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడిగేందుకు వచ్చావంటూ ప్రజలే నిలదీస్తున్నారని చంద్రబాబునాయుడు అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవకుమార్, కర్నూలు ఎంపీ అభ్యర్థి పంచలింగాల బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు, కోడుమూరు టీడీపీ అభ్యర్థులు బీవీ జయనాగేశ్వరరెడ్డి, మాధవరం రాఘవేంద్రరెడ్డి, కేఈ శ్యాంబాబు, బి. వీరభద్రగౌడు, బొగ్గుల దస్తగిరి, ఆదోని బీజేపీ అభ్యర్థి పి.వి పార్థసారథి, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి కె.మీనాక్షినాయుడు, కోడుమూరు మాజీ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, మాచాని సోమనాథ్‌లు చంద్రబాబును కలిశారు.

ప్రతి ఎకరాకు కృష్ణా జలాలు

కర్నూలు జిల్లా తుంగభద్ర నీటిపైనే ఆధార పడాలి. గోదావరి జలాలను కృష్ణాకు ఎత్తిపోసి.. కృష్ణా జలాలను ఎత్తిపోసి కర్నూలు జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చే లక్ష్యంగా ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. మన ప్రభుత్వంలో ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టు, గుండ్రేవుల ప్రాజెక్టులు ఇస్తే జగన్ నిర్వీర్యం చేశారు. బీవీ మోహన్‌రెడ్డి మంత్రిగా ఉండగా గురురాఘవేంద్ర ప్రాజెక్టు కోసం పరితపించారు. నిధులు తెచ్చి ఆ ప్రాజెక్టు పూర్తి చేస్తే ఈ జగన్ నిర్వహణకు నిధులు ఇవ్వక నిర్వీర్యం చేశారు. మన ప్రభుత్వం రాగానే ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం. ఈ ప్రాంతంలో కరువు, వలసల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు

ఎమ్మిగనూరు అంటే గుర్తుకు వచ్చేది చేనేతలే. చేనేతల ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని మన ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కు ఇచ్చి వంద ఎకరాల భూమి కేటాయిస్తే జగన్ ప్రభుత్వం వచ్చి రద్దు చేసింది. మళ్లీ మన ప్రభుత్వం రాగానే టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తాం. చేనేతలకు చేతిమగ్గం ఉంటే 200 యూని ట్లు, మర మగ్గం ఉంటే 500 యూనిట్లు ఉచిత కరెంట్ ఇస్తాం. చేనేతల కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తాం. వారి అభ్యున్నతి కోసం టీడీపీ అండగా ఉంటుంది.

వాల్మీకుల్ని ఎస్టీ.. కురువ, బుడగ జంగాలను ఎస్సీలుగా

వాల్మీలకు ఎస్టీలుగా, కురవ, బుడగ జంగాలను ఎస్సీలుగా మార్చేందుకు టీడీపీ కట్టుబడి ఉంది. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగలకు న్యాయం చేశాం. మాదిగ, మాల, రెల్లి వర్గాలకు టీడీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుది. ఆర్థిక, సామాజికంగా ముందుకు తీసుకొచ్చేందుకు టీడీపీ అండగా ఉంటుంది. టీడీపీ డీఎన్ఏలోనే బీసీ ఉంది. బలహీన వర్గాల అభ్యున్నతి కోసం టీడీపీ పాటు పడుతుంది. బీసీ డిక్లరేషన్ పక్కాగా అమలు చేసి బీసీలను ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకు తీసుకువస్తాం. ఈ ఎన్నికల్లో మంత్రాలయంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రాఘవేంద్రరెడ్డికి, ఆలూరులో వీరశైవలింగాయత్‌కు చెందిన వీరభద్రగౌడుకు, పత్తికొండలో ఈడిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ డిప్యూటీ సీఎం కుమారుడు కేఈ శ్యాంబాబుకు టీడీపీ టికెట్లు ఇవ్వగా, మిత్ర పక్షం బీజేపీకి ఆదోని సీటు ఇస్తే ఆ పార్టీ వాల్మీకి చెందిన డాక్టర్ పీవీ పార్థసారధికి టికెట్ ఇచ్చాం. సామాజిక న్యాయం అంటే ఇది.





టీడీపీ జెండాలతో..





చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు..

ప్రాజెక్టులు నిర్మించాలి

కర్నూలు జిల్లాలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్డీఎస్, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు ఇస్తే జగన్ నిర్వీర్యం చేశారు. మన ప్రభుత్వం వచ్చాక వాటిని పూర్తి చేయాలి. అసంపూర్తిగా ఉన్న ఉర్దూ యూనివర్సిటీ ని నిర్మించాలి, స్టేట్ క్యాన్సర్ యూనిట్‌కు అవసరమైన పరికరాలు అందించాలి. కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలి. కర్నూలు జిల్లాలో కరువు నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు, పత్తికొండలో టమోటా జూస్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలి.

- బస్తిపాటి నాగరాజు, టీడీపీ ఎంపీ అభ్యర్థి

బీవీ..మాచాని కుటుంబాలతోనే ఎమ్మిగనూరు అభివృద్ధి

ఎమ్మిగనూరు అభివృద్ధి అనగానే గుర్తుకు వచ్చేది మాచాని, బీవీ కుటుంబాలే. నాడు మాచాని సోమప్ప, శివన్న ఆ తర్వాత మా తండ్రి దివంగత బీవీ మోహన్‌రెడ్డి హయాంలోనే అభివృద్ధి జరిగింది. వారి వారసులుగా నేను..మాచాని సోమనాథ్ కలసి మళ్లీ అభివృద్ధికి శ్రీకారం చుడతాం. ఎమ్మిగనూరు తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.145 కోట్లతో గాజులదిన్నె నుంచి పైపులైన్ తెచ్చాం. గుడేకల్లు దగ్గర ఎస్ఎస్ ట్యాంకు కోసం 90 ఎకరాలు కేటాయిస్తే ఆ భూముల్లో వెంచర్లు వేసి అమ్ముకున్నారు. రాష్ట్రాన్ని దోచుకోవడానికి మళ్లీ వస్తున్నారు. వారిని తరిమికొట్టి టీడీపీ-జనసేనా-బీజేపీ కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

-బీవీ జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ అభ్యర్థి

రాష్ట్రాన్ని స్వర్ణయుగం వైపు నడిపించే సారథి చంద్రబాబు

జగన్మోహన్‌రెడ్డి విధ్వంసకర, అసమర్థ, అవినీతి పాలనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు. కనుచూపుమేరలో అభివృద్ధి కనిపించడంలేదు. సంక్షేమం పేరిట గారడిమాటలే తప్ప వాస్తవ సంక్షేమం లేదు. రివర్స్ టెండరింగ్ అంటూ పాలన వ్యవస్థే కాకుండా ప్రజల బతుకులు కూడా రివర్స్ చేసిన ఘనుడు జగన్. నవ్యాంధ్రను మళ్లీ గాడిలో పెట్టి సుసంపన్నరాష్ట్రంగా తీర్చిదిద్ది పేదల బతుకుల్లో వెలుగులు తీసుకువచ్చే నవ్యాంధ్ర బస్సుకు డ్రైవర్ చంద్రబాబు నాయుడు. ఆయనే ఈ రాష్ట్రాన్ని స్వర్ణయుగంవైపు నడిపించే సారథి.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు కూలీలు మృతి
- 11 మందికి గాయాలు
- మరో ఇద్దరి పరిస్థితి విషమం..



ఆదిలక్ష్మి (ఫైల్)



అనాథలైన చిన్నారులు

మద్దికెర, మార్చి 31: మద్దికెరలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. మిరపకాయలు తెంపే కూలి పనికి వెళ్లిన వారు ఇంటికి చేరుకోడానికి ఎక్కిన టాటా ఏసీ టైరు పేలి ఈ ప్రమాదం జరిగింది. ఆదిలక్ష్మి (50), సంజమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మద్దికెర గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి, సంజమ్మ, సాగప్ప, హారిక, రాధమ్మ సహా ఇరవై మంది కూలీలు చిప్పగిరి మండలంలో మిరపకాయలు తెంపే కూలి పనికి రోజులాగే ఓ అద్దె వాహనంలో వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి గ్రామానికి వస్తుండగా మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో మద్దికెర గ్రామ శివారులోని మూలింటి వారి పొలం వద్ద టాటా ఏసీ వాహనం ముందు టైరు పేలిపోయి అదుపు తప్పి పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న 20 మంది కూలీలు ఎగిరిపడ్డారు. అందులో ఆదిలక్ష్మి, సంజమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. బండి సాగప్ప, గూడిగ లక్ష్మి, సావిత్రమ్మ, కురువ లక్ష్మి, మున్ని, నిర్మల, హారిక, రాధమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని గుంతకల్లు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హారిక, రాధమ్మలను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో ఉపాధి పనులు, వ్యవసాయ పనులు లేక ప్రతిరోజు దాదాపు 300 మంది మిరపకాయల శుద్ధి పరికి బాడుగ వాహనంలో బయల్దేరుతున్నారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగాక స్థానికులు భారీగా తరలివచ్చారు. ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతులను ఆసుపత్రులకు తరలించారు.

అవ్వ మరణంతో అనాథలైన చిన్నారులు

కుటుంబ కలహాలతో తండ్రి దూరమయ్యాడు.. కన్నతల్లి అకాల మరణం చెందింది. అవ్వ ఆదిలక్ష్మి సంరక్షణలో ఇద్దరు చిన్నారులు ఉంటున్నారు. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అవ్వ ఆదిలక్ష్మి చనిపోయింది. చిన్నారులు ప్రణీతారెడ్డి, దీక్షితారెడ్డి అనాథలయ్యారు.



ప్రమాదం స్థలంలో గుమిగూడిన జనం

పత్తి రైతుపై పిడుగు

- ప్యాకెట్‌పై అదనంగా రూ.11 పెంపు?
- జిల్లా రైతులపై రూ.2.50 కోట్ల భారం

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 31: పత్తి విత్తనాల కంపెనీల యజమానులు మరోసారి భారం మోపనున్నాయి. పాలకుల మీద ఒత్తిడి తెచ్చి విత్తన ధరను పెంచుకునేందుకు ఆమోదం తీసుకున్నాయి. గత సంవత్సరం ఒక ప్యాకెట్ పత్తి విత్తనాలు (450 గ్రాముల) ధర రూ.853గా ప్రభుత్వం నిర్ణయించింది. విత్తన కంపెనీల యాజమాన్యాల ఒత్తిడిపై రాబోయే ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంటను సాగు చేసే రైతులపై భారాన్ని మోపే విధంగా రెండు రోజుల కిందట పాలకులు నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి నంచి పత్తి విత్తనాల ధరను రూ.864కు పెంచేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ప్యాకెట్‌పై రూ.11 అదనంగా పెరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 2.60 లక్షల హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో పత్తి పంటను సాగు చేసే జిల్లాగా కర్నూలు, నంద్యాల గుర్తింపు పొందాయి. ప్రతి సంవత్సరం పత్తి విత్తనాల ధరను యాజమాన్యాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పెంచుకోవడంలో విజయం సాధిస్తున్నాయి. ఒక ప్యాకెట్‌పై అదనంగా పెంచిన ధర రూ.11 లెక్కవేస్తే.. 22 లక్షల ప్యాకెట్ల మీద దాదాపు రూ.2.50 కోట్ల అదనపు భారాన్ని పత్తి రైతులు భరించాల్సి వస్తోంది.

ఉత్తర్వులు రాలేదు: వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ

కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తనాల ధరలను పెంచినట్లు తెలిసింది. అధికారికంగా మాకు ఉత్తర్వులు రాలేదు. వచ్చిన వెంటనే ఆ ధరలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

ఉగాది ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మార్చి 31: శ్రీశైలం క్షేత్రంలో ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు క్షేత్రాన్ని సందర్శించే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లను చేపట్టింది. ఆదివారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రంలోని పలు ప్రదేశాలను పర్యటించారు. ఇందులో భాగంగా యాంఫీ థియేటర్, మల్లమ్మ కన్నీరు, పలు ఉద్యానవనాలు, పార్కింగ్ ప్రదేశాలు, వలయ రహదారి మొదలైన చోట్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రోజురోజుకూ ఎండ తీవ్రత అధికమవుతోందని, క్షేత్ర పరిధిలో మరిన్ని చలువ పందిర్లు వేయాలని అధికారులను ఆదేశించారు. మంచినీటికి ఇబ్బంది పడకుండా నిరంతరం నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులకు సేవలందించే స్వచ్ఛంద సేవా సంస్థలకు దేవస్థానం తరపున సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వి. రామకృష్ణ, ఇన్‌చార్జి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సుబ్బారెడ్డి, చంద్రశేఖరశాస్త్రి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నగరానికి దాహం

- నేటి నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా
- అడుగంటిన భూగర్భ జలాలు

నీరు లేక వెలవెలబోతున్న సుంకేసుల జలాశయం



కర్నూలు(న్యూసిటీ), మార్చి 31: గత సంవత్సరం వర్షాలు లేకపోవడంతో జిల్లా వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో కర్నూలు నగరానికి దాహం తప్పదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సుంకేసుల డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం అడుగంటిపోవడంతోపాటు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో కూడ నీరు అంతంత మాత్రంగా ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులలో ఏప్రిల్ 1 నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరా చేసేలా అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి పత్రికల్లో ప్రకటనలు కూడ ఇచ్చారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించకపోవడంతోనే నగర వాసులకు నీటి కొరత రాబోతోందనే వాదన వినిపిస్తోంది. ఇప్పటి వరకు కర్నూలు అసెంబ్లీ పరిధిలోని అన్ని వార్డులకు అంతరాయం లేకుండా నీరు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటి పోవడంతో ఈ వార్డులతో పాటు నగర శివారు కాలనీ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

సుంకేసులే నగర వాసులకు దిక్కు...


నగరానికి ప్రధాన నీటి దిక్కు సుంకేసుల జలాశయం. ప్రస్తుతం ఇందులో నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. నగరానికి సంవత్సరంలో 1.7 టీఎంసీల నీరు అవసరం. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సామర్థ్యం 0.15 టీఎంసీ మాత్రమే. ప్రస్తుతం సుంకేసులలో నీరు లేకపోవడంతో గాజులదిన్నె నుంచి కేసీ ద్వారా నీటిని తీసుకొనున్నారు. ఈ నీటిని మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నిల్వ చేసి అక్కడ నుంచి నగరానికి అందిస్తున్నారు. గాజులదిన్నె నుంచి నగరానికి తాగునీటి అవసరాల కోసం ఒక్క టీఎంసీ నీటిని తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. గాజులదిన్నె నుంచి సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు వచ్చే లోగానే మధ్యలోనే సగం నీరు వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. దీనివల్లే నగరంలో రెండు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించుకున్నారు.

పని చేయని చేతి పంపులు..

నగరంలో సుమారు 800 పైగా చేతిపంపులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో 80 శాతం పైగా బోర్లు పని చేయడం లేదు. మరమ్మతులు చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాల్సి ఉండగా..వాటిని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. చేతి పంపులైన అందుబాటులో ఉంటే కొంతమేర నీటి సమస్య తప్పుతుందని స్థానికులు భావిస్తున్నారు.

శివారుల కాలనీల పరిస్థితి దుర్భరం

కల్లూరు, కోడుమూరు శివారు కాలనీలకు ఇప్పటికే రెండు, మూడు రోజులకు ఒక్కసారి నీరు సరఫరా చేస్తున్నారు. ఇదే ప్రాంతంలోని పలు కాలనీలకు నగర పాలక సంస్థ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నది. అవి కూడ సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్లు టయానికి రాకోవడంతో జనాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థలో విలీనమైన పెద్దపాటు, పందిపాడు, లక్ష్మీపురం గ్రామాలలో కూడా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. నగరంలో 7 లక్షలకు పైగా జనాభా ఉంది. ఎండలు తీవ్రం కావడంతో తాగునీటి సమస్య కూడా పెరిగింది. జలాశయాల్లో నీటి మట్టం అడుగంటడంతో నీటి సరఫరాపై నగర పాలక సంస్థ అధికారులు ఆంక్షలు విధిస్తున్నారు. నగరానికి ప్రతి రోజు 120 ఎంఎల్‌డీల నీరు అవసరం కాగా...ప్రస్తుతం 95 ఎంఎల్‌డీ వరకు అందిస్తున్నారు. ఇప్పటికే నగరంలోని 33 వార్డులకు ప్రతి రోజు తాగునీరు వదులుతుండగా ఏప్రిల్ నుంచి రోజు విడిచి రోజు అందించాలని అనుకుంటున్నారు.



సమ్మర్ స్టోరేజీ ట్యాంకు

వ్యక్తి ఆత్మహత్య

తుగ్గలి, మార్చి 31: జీవితంపై విరక్తి చెందిన సురేష్ (24) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం మండల పరిధిలోని పగిడిరాయిలో ఇంట్లో భార్య పుట్టింట్లో ఉరి వేసుకున్నాడు. ఆదోనికి చెందిన ఈరన్న కుమారుడు సురేష్‌కు ఏడు నెలల క్రితం పగిడిరాయికి చెందిన అంజలితో వివాహం జరిగింది. కుటుంబ తగాదాలతో జీవితంపై విరక్తి చెందిన సురేష్ భార్య ఊరిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జొన్నగిరి ఎస్ఐ రామాంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ వైద్యశాలకు తరలించారు.

క్రీస్తు మార్గాన్ని అనుసరించండి

- మత పెద్దల ఉద్బోధన ● ఘనంగా ఈస్టర్



దైవ సందేశం ఇస్తున్న పాస్టర్ రెవరెండ్ అనిల్‌కుమార్

కర్నూలు (కల్చరల్), మార్చి 31: క్రీస్తు చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని క్రైస్తవ మత పెద్దలు ఉద్బోధించారు. ఆదివారం ఉమ్మడి జిల్లాలోని క్రైస్తవులు ఈస్టర్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు. క్రీస్తు ప్రభువు సమాధి నుంచి పునరుత్థానమైన ఈస్టర్ సందర్భంగా వివిధ చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. ఈస్టర్ వేడుకను సంతోషంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. చర్చిల మతపెద్దలు ఈస్టర్ ప్రార్థనలు చేసి, భక్తులకు దైవ సందేశాన్ని అందజేశారు. సమాజంలో శాంతియుతంగా జీవించేందుకు క్రీస్తు అనేక బోధనలు చేశారని, వాటిని అనుసరిస్తూ కరుణ, దయ కలిగి ఉండాలని అన్నారు. అన్ని వర్గాల వారు సుఖశాంతులతో జీవించాలటే క్రీస్తు మార్గాన్ని అనుసరించాలని మత పెద్దలు ఉద్బోధించారు. పరస్పర ప్రేమ, సహకార గుణాలతో సమాజం ఆదర్శవంతంగా నిలుస్తుందని చెప్పారు. నగరంలోని పిల్లల పార్కు సమీపంలోని సీఎస్ఐ చర్చి, సి.క్యాంపులోని ప్రార్థన మందిరం చర్చి, కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి, శ్రీనివాసనగర్‌లోని స్టాంటన్ చర్చి, ఐదురోడ్ల కూడలిలోని రాక్‌వుడ్ చర్చి, రెవెన్యూ కాలనీలోని హోసన్న మందిరంలో ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు.



ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

కోడ్ ఉల్లంఘనపై కొరడా

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), మార్చి 31: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి భాగంగా రూ.1.74 కోట్ల నగదు, రూ.59 లక్షల విలువైన మద్యం, రూ.16లక్షల విలువైన వస్తువులు మొత్తం కలిపి రూ.2.49 కోట్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని చెప్పారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు ఎలాంటి కార్యక్రమాలకైనా ముందస్తు అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. సువిధ యాప్ ద్వారా అనుమతులు మంజూరు చేస్తామని, సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించి వంద నిమిషాల్లో పరిష్కరిస్తామన్నారు. ఎఫ్ఎస్‌టీ., ఎస్ఎస్‌టీ, పోలీసు ఎన్ఫోర్స్మెంట్ టీమ్స్ ద్వారా సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ పటిష్టంగా చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే 33 నిత్యావసర సేవలు అందించే శాఖలకు పోస్టల్ బ్యాలెట్ విధానం వర్తిస్తుందని తెలిపారు.

పింఛన్ సొమ్ము కాంట్రాక్టర్లకు

మాజీ ఎమ్మెల్యే బీసీ



బనగానపల్లె, మార్చి 31: ఖజానాలోని పింఛన్ డబ్బులు కాంట్రాక్టర్లకు ఊడ్చి పెట్టడం వల్లే లేకపోవడం వల్లే లబ్ధిదారులకు పంపిణీ నిలిచిపోయిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల సొమ్మును సీఎం జగన్ వైసీపీ కాంట్రాక్టర్లకు ఊడ్చి పెట్టారని అన్నారు. దీంతో వృద్ధులు, వితంతులు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయడం లేదని అన్నారు. ఖజానాలో డబ్బు లేకుండా చేసి పింఛన్ల పంపిణీకి ఎన్నికల కమిషన్ అడ్డుపడిందని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా యుద్ధ ప్రాతిపదికన పింఛన్లు 1వ తేదీన పంపిణీ చేయాలని బీసీ డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే రూ.4 వేల పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. ప్రజల పన్నుల ద్వారా వచ్చే డబ్బును వలంటీర్లకు గౌరవ వేతనం ఇస్తూ వారిని వైసీపీ కార్యకర్తల్లాగా పని చేయించుకోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు. వలంటీర్లను వైసీపీ కార్యకలాపాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. వలంటీర్ల సస్పెన్షన్‌కు జగన్ ప్రధమ కారకుడని ఆరోపించారు.

పెండింగ్ రెమ్యునరేషన్ చెల్లించాలి

- లేదంటే మూల్యాంకనం విధులు బహిష్కరిస్తాం
- ఉపాధ్యాయుల హెచ్చరిక
- నేటి నుంచి పది స్పాట్ ప్రారంభం

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 31: పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ శిబిరానికి ఉపాధ్యాయుల నుంచి నిరసన సెగ తగలనుంది. గత ఏడాది మే, సెప్టెంబరు నెలలో జరిగిన పది పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ రెమ్యునరేషన్ ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదు. గతంలో డీఈవోగా పని చేసిన రంగారెడ్డి పరీక్షల నిర్వహణ నిధులను స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై ఒక జూనియర్ అసిస్టెంట్‌కు మెమో ఇచ్చి జిల్లా విద్యాశాఖ అధికారులు చేతులు దులుపుకున్నారని, జిల్లా విద్యాశాఖ అధికారి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌ను బాధ్యుడ్ని చేసి గత 8 నెలల నుంచి జీతాలను నిలిపివేశారు. అప్పట్లో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పెండింగ్ స్పాట్ రెమ్యునరేషన్ చెల్లించాలని ఆందోళనలు నిర్వహించాయి. ప్రస్తుత కలెక్టర్ డా.జి. సృజనకు కూడా ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత జిల్లా విద్యాశాఖ 25 శాతం రెమ్యునరేషన్ ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేసి చేతులు దులుపుకుంది. ఏడాది పూర్తవుతున్నా మిగతాది ఇవ్వలేదు. పెండింగ్ రెమ్యునరేషన్ ఇవ్వకపోతే సోమవారం నుంచి జరగబోయే పది స్పాట్ వాల్యుయేషన్ విధులను బహిష్కరిస్తామని అన్ని ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరించాయి.

నేటి నుంచి పది పరీక్షల మూల్యాంకనం ప్రారంభం

పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు కర్నూలు ఏ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ మూల్యాంకన శిబిరానికి ఏడుగురు అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ ఒకరు, చీఫ్ ఎగ్జామినర్స్ 150 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్స్ 600 మందిని నియమించారు. ఉపాధ్యాయులకు డ్యూటీ ఆర్డర్స్ కూడా పంపించారు. ఆర్డర్లు తీసుకున్నవారందరూ ఒకటో తేదీన విధుల్లో చేరాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూయేల్ సూచించారు. గత రెమ్యునరేషన్ పెండింగ్ నేపథ్యంలో స్పాట్ వాల్యుయేషన్ ఎలా జరుగనున్నదనే సందిగ్ధత నెలకొంది.

వైఎస్సార్ బోర్డు తొలగింపు



నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ రేకులకు ఏర్పాటు చేసిన వైఎస్సార్ బోర్డును తొలగించడానికి వచ్చిన ఎన్నికల సిబ్బంది

ఆదోని రూరల్ మార్చి 31 : ఆదోని మండలం ఆరేకల్లు సమీపంలో నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కాలేజీ ప్రహరీకి ఏర్పాటు చేసిన రేకులకు డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కాలేజీ అనే బోర్డును గత శుక్రవారం జగన్ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేశారు. దీంతో కాలేజీ భవనాలు నిర్మించకపోయినా... బోర్డు పెట్టేశారు అనే కథనాన్ని ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. దీనికి స్పందించిన ఎంపీడీఓ శేఖర్ ఎలెక్షన్ సిబ్బందితో కలిసి హుటాహుటీన అక్కడికి చేరుకొని బోర్డును తొలగించారు. ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూస్తామని, ఎన్నికల కోడ్‌ను పటిష్టంగా అమలు చేస్తామని అన్నారు.

మహానందిలో ఏపీ హైకోర్టు జడ్జిలు పూజలు



ఏపీ హైకోర్టు జడ్జి సురేష్‌రెడ్డికి మెమెంటో అందజేస్తున్న ఏఈఓ మధు

మహానంది, మార్చి 31 : మహానంది క్షేత్రంలో ఆదివారం ఏపీ హైకోర్టు జడ్జిలు జస్టిస్ ఏవి రవీంద్రబాబు, సురేష్‌రెడ్డి వేర్వేరుగా ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయం ముఖ ద్వారం వద్ద ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ ఎర్రమల్ల మధు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో జడ్జిలు మహానందీశ్వరునికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయం ప్రాంగణంలోని అలంకార మండపంలో వేదపండితులు వీరిని శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. ఆలయ అధికారులు మెమెంటోలను అందజేశారు. వీరి వెంట నంద్యాల జిల్లా మూడో అదనపు జిల్లా జడ్జి వాసు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ పాల్గొనగా మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

44 మందికి షోకాజ్ నోటీసులు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 31: పీవో, ఏపీవో శిక్షణా తరగతులకు పత్తికొండ నియోజకవర్గంలో 16 మంది, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 12మంది, ఆలూరు నియోజకవర్గంలో తొమ్మిది మంది, మంత్రాలయం నియో జకవర్గంలో ఏడుగురు గైర్హాజరు కావడంతో వారికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన ఆదివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా ముగిసిన సుయతీంద్రతీర్థుల

11వ ఆరాధనోత్సవాలు

మూలరాములకు కనకాభిషేకం చేసిన పీఠాధిపతి



మూలరాములను భక్తులకు చూపిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 31: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి, మంత్రాలయం నవనిర్మాణ శిల్పి సుయతీంద్రతీర్థుల 11వ ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో సుయతీంద్రతీర్థుల మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టువస్త్రాలు, గులాబి పుష్పాలతో అలంకరించి మహా మంగళహారతులు ఇచ్చారు. యజ్ఞశాలలో సుయతీంద్రతీర్థుల ప్రవచనాలు వినిపించారు. పూర్ణబోధ పూజామందిరంలో మూలరాములకు కనకాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పండితకేసరి రాజా ఎస్ గిరిరాజాచార్, ఎస్ఎన్ వెంకటేశాచార్, గయా రమాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ముగ్గురు మృతి

ఆలూరు, మార్చి 31 : ఆలూరు మండలం హత్తిబెళగల్ సమీపంలో శనివారం ఆటో టైర్ పేలి బోల్తాపడిన సంఘటనలో 30 మంది గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించగా ఆదివారం తెల్లవారుజామున హులేబీడు గ్రామానికి చెందిన దస్తగిరమ్మ (55) వేకున్ బీ (30) చికిత్స పొందుతూ మృతి చెందారు. అలాగే మస్తానమ్మ, (65) చికిత్స పొందుతూ మృతి చెందారు. వీరంతా వ్యవసాయ కూలీలు. ప్రమాదంలో ముగ్గురు ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతి చెందిన కుటుంబాల్ని ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన, సీపీఎం, సీపీఐ నాయకులు వెంకప్ప, నారాయణస్వామి, భూపేష్, రామాంజినేయులు డిమాండ్ చేశారు.

తిరుణాలలో సందడే సందడి







కోడుమూరు (రూరల్), మార్చి 31: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ దుకాణాలు వెలిశాయి. హంద్రీనదిలో పలువురు భక్తులు టెంట్లు ఏర్పాటు చేసుకుని విడిది చేశారు. తిరుణాల సందర్భంగా స్వీటు దుకాణాలు ఏర్పా టు చేశారు. మాంస ప్రియులకు చికెన్, మటన్, కడ్డీలు నోరూరిస్తున్నాయి. దుకాణాల్లో ఆట బొమ్మలను చిన్నారుల కోసం పెద్దలు కొంటున్నారు. పలువురు హంద్రీలో స్నానాలు చేస్తున్నారు. బ్రేక్ డ్యాన్స్, రాట్నాలు, ఉయ్యాలలు, ఎగిరే నెట్, జారుడుబల్ల వంటివి ఆహ్లాదా న్ని పంచుతున్నాయి. మహిళలు గాజులు, అలంకార వస్తు వులు, వంట సామాగ్రి కొంటున్నారు. భక్తులు, సంద ర్శకుల రాకపోకలతో గోరంట్ల వీధులు నిండిపోయాయి.

కాడిని దించుకుంటున్న రైతన్నలు

మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామి తిరుణాలను రైతుల జాతర అని పిలుస్తారు. బ్రహ్మోత్సవాల సమయానికి ఏటా వ్యవసాయ పనులు దాదాపు పూర్తి అవుతాయి. దీంతో పరిసర మండలాల గ్రామాల నుంచి రైతులు ఎద్దుల బండ్లను కట్టి కుటుంబంతో కలిసి విచ్చేస్తారు. హంద్రీనది అవతలి గట్టున తోటలో విడిది చేస్తారు. రెండు మూడు రోజుల పాటు ఉండి వ్యవసాయ పనిముట్లు, వంటసామాగ్రి వంటివి కొనుగోలు చేస్తారు. అలాగే ఎద్దుల క్రయ, విక్రయాలు జరుపుతారు. అయితే ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పంట దిగుబడులు దారుణంగా పడిపోయాయి. పంటకు పెట్టిన పెట్టుబడులు అటుంచి, పశువులకు గ్రాసం కరువైంది. కరువు కుదుపుతో చాలామంది రైతులు పశుగ్రాసం కొనలేక ఎద్దులను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. గోరంట్ల తిరుణాలలో ఎద్దులను విక్రయించేందుకు వచ్చిన పలువురు రైతులు మాట్లాడుతూ ఇంతటి కరువును ఎన్నడూ చూడలేదని ఆవేదన చెందారు. తప్పనిసరి పరిస్థితులతో కాడిని భుజం దింపుకుంటున్నామని జీరబోయిన గొంతుతో తెలిపారు.

బాధతో అమ్ముకుంటున్నా

రెండేళ్లుగా పంటలేవు. ఈ ఏడాది తీవ్ర కరువు ఏర్పడింది. దీంతో పంట పెట్టుబడులు రాలేదు. కౌలు కూడా చెల్లించుకోలేని పరిస్థితి ఏర్పడింది. నాలుగైదు ఎకరాల్లో పత్తి, వేరుశనగ పంటలు వేసి నష్టపోయా. అప్పులు పెరగడంతో పశువులకు గ్రాసం కొనలేక అమ్ముకుంటున్నా. వ్యవసాయంలో తోడుగా ఉన్న ఎద్దులను అమ్మాలంటే బాధగా ఉంది.

-రాజారత్నం, బోదెపాడు, గోనెగండ్ల మండలం

జగన్‌కు ఓటమి భయం: బైరెడ్డి



అభివాదం తెలుపుతున్న టీడీపీ నాయకులు

నంద్యాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలో నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి ఎన్నికల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. బైరెడ్డి మాట్లాడుతూ వైసీసీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. ఈ ఐదేళ్ల జగన్ అడ్డగోలుగా రాష్ట్ర సంపదను దోచుకొని విదేశాలకు తరలి పోయేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజకీయ విలువలు పాటించకుండా డబ్బు, ఆహంకారంతో శిల్పా కుటుంబం శిల్పా పోల్స్ అంటూ విర్రవీగుతున్నారని, శిల్పా పోల్పాకు నంద్యాల, శ్రీశైలం నియోజక వర్గం ప్రజలే అడ్డుకట్ట వేయబోతున్నారని బైరె డ్డి అన్నారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఐదేళ్ల ప్రజల సమస్యలు విస్మరించి ధనార్జనే ధ్యేయంగా ముందుకెళ్లారన్నారు. ప్రజలకు ఎంపీ ఎవరో కూడా తెలియకుండా ఉన్నారన్నారు. మల్లెల రాజశేఖర్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు తాతిరెడ్డి తులసిరెడ్డి, ఏవీఆర్ ప్రసాద్ మాట్లాడారు. జిల్లాలో టీడీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ శివనాగిరెడ్డి, టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. బైరెడ్డి సమక్షంలో నంద్యాల, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు.

టీడీపీలో చేరిన విశ్రాంత ఆర్మీ జవాన్లు

నంద్యాల (కల్చరల్), మార్చి 31: నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం రిటైర్డ్ ఆర్మీ జవాన్లు నంద్యాల జిల్లా సీఏపీఎఫ్ సభ్యులు, బీఎస్ఎఫ్ ప్రెసిడెంట్ మౌలాలి, సీఐఎస్ఎఫ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, బీఎస్ఎఫ్ సెక్రటరీ హఫీజుల్లా, ఐటీబీపీ ట్రెజరర్ షేక్ పక్రుద్దీన్, సీఆర్‌పీఎఫ్ వీవీ సుబ్బయ్య, లక్ష్మీనాయక్, ఎల్.నాయక్, కోటేశ్వర రావు, మల్లారెడ్డి, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ తాహెర్ అహ్మద్, బీఎస్ఎఫ్ మధుసూదన్, ఐటీబీపీ రఫి టీడీపీలో చేరారు. వీరికి మాజీ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి అభినందన

ఆత్మకూరు, మార్చి 31: ఆత్మకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియామకమైన వేముల వెంకటేశ్వర్లును శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అభినందించారు. ఇటీవల ఆత్మకూరు బార్ అసోషియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన వెంటేశ్వర్లుతో పాటు పలువురు న్యాయవాదులు ఆదివారం ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన వారిని అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కంచర్ల గోవిందరెడ్డి, గిరిరాజు, నూర్‌అహ్మద్, కేపీ చౌదరి, శివశంకర్ తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: గౌరు చరిత



పథకాలపై అవగాహన కల్పిస్తున్న గౌరు చరిత

గడివేముల, మార్చి 31: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆమె బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. సూపర్-6 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. నిత్యావసర ధరలు ఆకాశనంటాయని ఆరోపించారు. అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టక పోవడంతో రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, కాలిద్‌బాషా, సుభద్రమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం: మాండ్ర



సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్‌కు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాండ్ర శివానందరెడ్డి

కొత్తపల్లి, మార్చి 31: టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు బీసీలకు రక్షణ చట్టం తీసుకు వస్తారని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. ఆదివారం శివాపురంలో మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయహో బీసీ సదస్సులో మాండ్రతో పాటు నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య పాల్గొని మాట్లాడారు. ముందుగా శివపురం గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి మాండ్ర టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన బీసీ సదస్సులో మాండ్ర మాట్లాడుతూ కొత్తపల్లి మండలం గత టీడీపీ హయాంలోనే ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. జయసూర్య మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వస్తేనే బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, మాండ్ర లింగన్న, జడ్ వెంకటరెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, రహీంఖాన్, ఏఎస్ రాజు, గిరీశ్వర్ రెడ్డి, రఘురాముడు, శివకుమార్ పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: అల్లూరులో మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో నందికొట్కూరు పట్టణంలోని సాయిబాబపేట, సుబ్బరావు పేటకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, సురేంద్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఎరుకలి అజయ్, కిరణ్, చైతన్య, అమీర్, సాయి, వేణు తదితరులు టీడీపీలో చేరారు.

● కొత్తపల్లె మండలంలోని గువ్వకుంట్ల గ్రామం (బండినేని పాలెం) గ్రామ వైసీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో వెంకటరెడ్డి, శివలింగం, శంకర్, లక్ష్మన్న, మానిక్యరావు తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్ర నాథరెడ్డి, భూషన్న పాల్గొన్నారు.

ఉల్లి రైతు కన్నీరు

● వర్షాలు లేక తగ్గిన దిగుబడి
● గిట్టుబాటు ధర లేక ఆవేదన

నందికొట్కూరు రూరల్, మార్చి 31: నందికొట్కూరు డివిజన్ పరిధిలో ఉల్లి రైతులు ఈ సంవత్సరం అన్నికరాలుగా భారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఈ ఖరీఫ్, రబీ కాలంలో కూడా ఉల్లి రైతులకు కన్నీరే మిగిలింది. క్వింటం ఉల్లి ధర మార్కెట్‌లో రూ.600 నుంచి రూ.1200 మాత్రమే పలుకుతుండడంతో ఉల్లి రైతులు భారీగా నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. నందికొట్కూరు డివిజన్ పరిధిలో నందికొట్కూరు మండలంలో నందికొట్కూరు, వడ్డెమాను, బ్రాహ్మణ కొట్కూరు, అల్లూరు, దామగట్ల, బొల్లవరం గ్రామాలలోను మరియూ జూపాడు బంగ్లా మండలంలోని తంగెడంచ, మండ్లెం, జూపాడుబంగ్లా, భాస్కరాపురం, కొత్తపల్లె మండలంలోని ఎదురుపాడు, జెడ్డువారిపల్లె గ్రామాలలో, పాములపాడు మండలంలోని బుద్దనగర్, క్రిష్ణానగర్, క్రిష్ణరావుపేట గ్రామాలలో ఉల్లి పంటను రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ కాలంలో వర్షాలు సరిగ్గా కురవక పోవడంతో ఉల్లి దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయని రైతులు చెబుతున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులను నిలిపి వేయడంతో గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో ఉల్లి రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు సుమారు వంద క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా 60 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మార్కెట్‌లో కుప్పలుగా పోసిన ఉల్లి

మూడెకరాల్లో సాగు చేశా



నందికొట్కూరు గ్రామీణ ప్రాంతంలో 3 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశాను. ఎకరాకు రూ.80 వేల వరకూ పెట్టుబడి ఖర్చు వచ్చింది. ఎకరాకు 60 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో వ్యాపారులు క్వింటం ఉల్లి ధర రూ.600 లకు అడుగుతున్నారు. ఈ లెక్కన ఎకరాకు రూ.44 వేలు నష్ట పోవాల్సి వస్తుంది.

\- మురళి, రైతు, నందికొట్కూరు

వర్షాలు లేకపోవడంతో దిగుబడి తగ్గింది

ఈ ఏడాది ఖరీఫ్, రబీ కాలంలో వర్షాలు ఆశించినంత కురవకపోవడంతో పంటల దిగుబడులు సహజంగానే తగ్గాయి. అలాగే ఉల్లి పంట కూడా రైతులు ఈ సంవత్సరం తక్కువగానే విత్తుకున్నారు. బోరుబావుల క్రింద మాత్రం నీరు సమృద్ధిగా ఉన్న చోట్ల ఎకరాకు 100 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. కానీ గిట్టుబాటు ధరలు మాత్రం ఆశించినంతగా లేదు.

\- దివ్య, ఉద్యానశాఖ ఇన్‌చార్జి అధికారి

ఎమ్మెల్యే శిల్పాను నమ్మి మళ్లీ మోసపోకండి

● శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, మార్చి 31: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని నమ్మి మళ్లీ మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఇందిరేశ్వరం గ్రామంలో సుమారు 150 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ నాలుగు హామీలు ఇస్తే.. ఎమ్మెల్యే శిల్పా 40 తప్పుడు హామీలతో ఇక్కడి ప్రజలను అన్ని విధాలుగా మోసం చేశారని అన్నారు. వర్ధన్ బ్యాంకు పేరిట రూ.30 కోట్లు దండుకున్నారని ఆరోపించారు. శ్రీశైల మల్లన్న భక్తులను కూడా వదలకుండా దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఎక్కడి నుంచో వలస వచ్చిన శిల్పాకు ఇక్కడి ప్రజల కష్టాలు ఏం తెలుసని అన్నారు. తనది పక్కనే ఉన్న వేల్పనూరు అని, ఏకష్టం వచ్చినా ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీలోకి చేరిన వారు మాజీ ఎమ్మెల్యే బుడ్డాను ఘనంగా సత్కరించారు. పార్టీలోకి చేరిన వారిలో ఉప సర్పంచ్ బాలస్వామి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, వెంకటలక్ష్మమ్మ, వెంకటేశ్వర్లు చౌదరి, వార్డు సభ్యులు లక్ష్మీదేవిలు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తిరుపమయ్య, నాయకులు వెంకటరావు, నబిరసూల్, పుల్లారెడ్డి, దగ్గుపాటి శ్రీనివాసులు, షఫీవుల్లా, అబ్దుల్లాపురం బాషా, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ దివంగత మోమిన్ హుసేన్ సాహెబ్ కుటుంబానికి చెందిన మోమిన్ షఫీవుల్లా, మోమిన్ ఇబ్రహీం ఖలీలుల్లా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే బుడ్డాను మర్యాదపూర్వకంగా వారి స్వగృహానికి ఆహ్వానించి ఆయన సమక్షంలో టీడీపీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. ఆత్మకూరు మండలం సిద్దేపల్లి కొట్టాలకు చెందిన పీట్ల ఓబులేసు, ఇరగదిండ్ల వెంకటరమణ, సత్యభాను, చిన్నరాముడు, వెంకటేశ్వర్లుతోపాటు సుమారు 50 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరాయి. అలాగే ఆత్మకూరు మండలం సిద్దేపల్లి కొట్టాలకు చెందిన పీట్ల ఓబులేసు, ఇరగదిండ్ల వెంకటరమణ, సత్యభాను, చిన్నరాముడు, వెంకటేశ్వర్లుతోపాటు సుమారు 50 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బుడ్డా సమక్షంలో టీడీపీలోకి చేరాయి.



ఇందిరేశ్వరంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

● **వెలుగోడు:** శ్రీశైల నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. వెతుగోడు మండలంలోని గుంత కందాల గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన కనతల ఏసేపు, బుజ్జి, శివయ్యగౌడ్ పెద్దస్వామి, రాజశేఖర్ మల్లికార్జునతోపాటు మరో 50 కుటుంబాలు బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. గాండ్ల శివన్న, అన్నారపు శేషి రెడ్డి, మోతుకూరు సుధాకరరెడ్డి, జనసేన నాయకులు శాలు బాషా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



నందికొట్కూరులో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



వెలుగోడులో..



గడివేములలో..



ఆత్మకూరులో రంగులతో సంబరాలు చేసుకుంటున్న క్రైస్తవులు

నంద్యాల (కల్చరల్), మార్చి 31: నంద్యాలలో పలు చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకను పురస్కరించుకొని క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. నంద్యాల హోలీ క్రాస్ కెథడ్రిల్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ వి.పాల్‌రాజారావు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారుజామునే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం తమ ఇళ్ల వద్ద రంగులు చల్లుకుంటూ ఎంతో ఆనందనంగా గడిపారు. నంద్యాలలోని అన్ని చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. నంద్యాల పెద్దచర్చి, హోసన్న మందిరం, జ్ఞానాపురం చిన్న చర్చిలను మాజీ మంత్రి, నంద్యాల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్‌ఎండీ ఫరూక్ సందర్శించి ఈస్టర్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బిషప్ వరప్రసాద్ చేత ప్రత్యేక ఆశీర్వాద ప్రార్థనలు నిర్వహించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అలాగే హోసన్న ప్రార్థన మందిరం, జ్ఞానాపురం చిన్న చర్చి పాస్టర్ల చేత కూడా ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృపాకర్, దేవరపాటి రవి, చిన్న మిద్ద హుస్సేన్, జార్జి ఇమ్మానియేల్, తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాదనలు నిర్వహించారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈస్టర్ పండుగ సందర్భంగా యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు.

నందికొట్కూరు: ఈస్టర్ పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం నిర్వహించారు. నందికొట్కూరులోని సీఎస్ఐ ప్రార్థన మందిరంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. డీనరీ చైర్మన్ రెవ. నర్రా మైకేల్ శ్యాంసుందర్ బాబు సందేశం అందించారు. టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య ప్రార్థనలు చేశారు. రెవ. ఉత్తమ వర ప్రెస్బిటర్, బి.జాన్ క్రిసోస్టం, సెక్రటరీ లింగం జయచంద్ర బాబు, ట్రెజరర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్, ఎస్సీజీపాలెం, ఏబీఎంపాలెం తదితర చర్చీలతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోని అన్ని చర్చీల్లో ఉదయం నుంచే ఆయా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ప్రబోధకులు ఏసుక్రీస్తు పునఃర్జన్మ వివరాలను ప్రబోధించారు. ప్రపంచశాంతి ఏసుక్రీస్తు బోధనలను ప్రతిఒక్కరు పాటించాలని పిలుపునిచ్చారు. కాగా 40రోజులుగా ఉపవాసదీక్షలు చేపట్టిన క్రైస్తవులు ఈస్టర్ పర్వదినం దీక్షలను ముగించి సంబరంగా పండుగను జరుపుకొన్నారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈస్టర్ వేడుక గురించి పాస్టర్లు వివరించారు. సీఎస్ఐ డీనరీ చైర్మన్ రాజేంద్రబాబు తెలిపారు. ఈ పండుగకు ముందు 40 రోజులు ఉపవాస దినాలు పాటిస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

'టీడీపీతోనే వాల్మీకులకు గుర్తింపు'

పాణ్యం, మార్చి 31: టీడీపీతోనే వాల్మీకులకు రాజకీయంగా గుర్తింపు లభించిందని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు అన్నారు. పాణ్యం టీడీపీ కార్యాలయంలో ఆదివారం వాల్మీకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు కల్పించడంతో వాల్మీకులు రాజకీయంగా ఎదగడానికి అవకాశం లభించిందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్, మునిసిపల్ చెర్మన్‌లుగా ఎదిగారన్నారు. చట్టసభల్లో రాజ్యాంగ హక్కు పొందారన్నారు. రాష్ట్రంలో మొట్టమొదట కాల్వ శ్రీనివాసులుకు క్యాబినెట్ హోదా కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. శాసనమండలి ఎమ్మెల్సీగా బీటీ నాయుడుకు అవకాశం కల్పించారన్నారు. వాల్మీకి బోయ ఫెడరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు అందించిందన్నారు. శాసనసభలో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తింపుకై కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సాధికార సమితి సభ్యులు గుజ్జుల సుబ్బయ్య, శేఖర్‌నాయుడు, టైలర్ శేషు, రమేష్, ప్రసాద్, టీసీ మద్దిలేటి, కిట్టు, ఎల్లనాయుడు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, మార్చి 31: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి అలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

'రేషన్ లబ్దిదారులకు సబ్సిడీపై చక్కెర'

నంద్యాల (కల్చరల్), మార్చి 31: జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యం, సబ్సిడీపై చక్కెర, గోధుమపిండి ప్రతి నెల ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ నెల బియ్యానికి బదులుగా 3 కిలోలు జొన్నలు ఉచితంగా, రాగిపిండి ఒక్కో కార్డుకు కిలో రూ.11 రూపాయలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం: శబరి



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పాములపాడు, మార్చి 31: ఒక్క అవకాశం అంటూ సీఎం జగన్ ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారం చేపట్టాక ఆంధ్రప్రదేశ్‌ను ఈ ఐదు సంవత్సారాల పాలనలో సర్వనాశనం చేశారని నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం పాములపాడు టీడీపీ నాయకులు కురువ ఎల్లయ్య కుమారుడు టీడీపీ యువనేత రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరయ్యారు. దాదాపు వంద బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో నాసిరకం మద్యంతో ప్రజలను చంపేస్తున్నారన్నారు. ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారన్నారు. మిట్టకందాల గ్రామం నుంచి మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు మహేశ్‌నాయుడు, కాకరవాడ చిన్న వెంకటస్వామి, అశోకరత్నం, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, జనసేన నాయకులు రాము, బీజేపీ నాయకులు దామోదర్‌రెడ్డి, లోకేశ్, రామక్రిష్ణ, ఈశ్వరరెడ్డి, రాముచౌదరి పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న శబరి

నందికొట్కూరు: నందికొట్కూరు పట్టణంలో ముస్లిం మహిళలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.బైరెడ్డి శబరి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంతో ముసింలతో పాటు ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నందికొ ట్కూరు నియోజకవర్గ అధికారప్రతినిది డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి, ముస్లీం మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

నంద్యాల (కల్చరల్), మార్చి 31: పొన్నాపురం ఎల్లద్దాయి సన్నిధి ఫౌండేషన్ నంద్యాల వారి ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న అనేక మంది పేషెంట్ సహాకులు భోజనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా నంద్యాల తాలుకా సీఐ దస్తగిరి, ట్రాఫిక్ సీఐ షేక్ ఇస్మాయిల్ హాజరై భోజనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వహకులు ఇమ్మానియేలు, డైరక్టర్ ప్రభు ఇమ్మానియేలు, ఫౌండేషన్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల తనిఖీ



కన్నడిగుడి మృతి వివరాలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో

ఆత్మకూరు రూరల్, మార్చి 31: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వస్తున్న కన్నడ భక్తుల కోసం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్తున్న కుప్పాలం జిల్లా వాసి కన్నడ భక్తుడు శేఖరప్ప నాగలూటి వీర భద్రాలయం వద్ద గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం కన్నడీగుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఆ యాత్రికుడి మృతి వివరాలను వైద్యాధికారి పవన్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పాదయాత్రగా తరలి వచ్చే కన్నడీగుల కోసం ఏర్పాటు చేసిన వైద్య సేవల గురించి వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్‌లతో ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య అధికారులకు పలు సూచనలు చేశారు. యాత్రికులకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే సత్వర ఆరోగ్య సేవలు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం అక్కడి 108లో పాదయాత్రికులకు సత్వర సేవలు ఎలా అందించాలో 108 సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాదయాత్రికులకు సత్వర సేవలు అందించేందుకు ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో భక్తులు ఉదయం పదిగంటల లోపుకాని, సాయంత్రం 4 గంటల తర్వాత పాయాత్రను కొనసాగించాలని, అలాగే వైద్య శిబిరాల్లో అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, సీహెచ్‌వోలు, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

వడదెబ్బతో మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

ఆత్మకూరు, మార్చి 31: ఆత్మకూరు మండలం కరివేన గ్రామ పొలిమేరలోని పంట పొలాల్లో ఆదివారం వడదెబ్బతో మతిస్థిమితంలేని ఓ వ్యక్తి మృతి చెందారు. సుమారు ఏడాది నుంచి గుర్తు తెలియని మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి ఆత్మకూరు ప్రాంతంలో తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే ఎండల తీవ్రతతో వడదెబ్బ సోకి ఆదివారం కరివేన గ్రామ సమీపంలోని పంటపొలంలో శవమై కనిపించారు. అక్కడున్న వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా మృతుని ఆచూకీ లేకపోవడంతో కరివేన గ్రామ పంచాయతీ కార్మికుల చొరవతో అంత్యక్రియలు నిర్వహించారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత



చెట్టును కాల్చివేసిన దృశ్యం

నంద్యాల రూరల్, మార్చి 31: జీవకోటి మనుగడకు ఊపిరిలాదే చెట్ల ఊపిరి తీస్తున్నారు స్వార్థపరులు. వ్యాపార కాంక్షతో తమ స్వార్థం కోసం చెట్లను మొదలంటా కాల్చి కూల్చి వేస్తున్నారు స్వార్థపరులు. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప నివారించే ప్రయత్నం చేయకపోవటం వెనుక కారణాలేంటో దేవుడికెరుక. నంద్యాల జిల్లా కేంద్రం నుంచి గాజులపల్లె వైపు వెళ్లే రహదారిలో గోపవరం సీతారామపురం గ్రామాల మధ్యలో భారీ వృక్షాల మొదళ్లలో నిప్పు పెట్టి వాటిని మొదలంటూ కూల్చివేస్తున్నారు. పర్యావరణానికి ప్రాణమైన చెట్లను కూల్చి వేయటం వల్ల వాతావరణం సమతుల్యం దెబ్బతిని ఉష్ణోగ్రతలు భరించలేని స్థాయిలో పెరుగుతున్నాయి. చెట్లను కూల్చటం వల్ల పచ్చదనం తగ్గి వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఒక్క చాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, మార్చి 31: ఒక్క చాన్స్‌తో సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, మరో అవకాశం ఇస్తే ఏపీని బంగాళాకాతంలో కలుపుతారని టీడీపీ డోన్ అభ్యర్థి, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అలేబాదు, అలేబాదుతండా, మునిమడుగు, భోంచెర్వుపల్లిలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగన్ ఏ మాత్రం నెరవేర్చలేదన్నారు. కేఈ, కోట్ల కుటుంబాలు మండలంలోని కొండమీది గ్రామాల్లో రోడ్లు, తాగునీటి పథకాలు తదితర ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాయన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. అలాగే అలేబాదులో ప్రజల వినతి మేరకు ఇళ్ల స్థలాలు, టీటీడీ కళ్యాణ మండపం ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. చంద్రబాబు మేనిఫెస్టోలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, నాయకులు అలేబాదు పరమేష్, ఆర్ఈ నాగరాజు, టి.శ్రీనివాసులు, అలేబాదు మల్లికార్జున, శ్రీకాంత్, వెంకటరమణాచారి, సురేంద్ర చౌదరి, గోపీ నాయక్ పాల్గొన్నారు.

వైసీపీ గల్లంతు కావడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



దొరపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 31: వైసీపీ ప్రభుత్వ విధ్వంస విధానాలపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహంలో ఆ పార్టీ గల్లంతవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని దొరపల్లి గ్రామంలో మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి మద్దతుగా కోట్ల సుజాతమ్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం భ్రష్టు పట్టిందని మండిపడ్డారు. వైసీపీ పాలనలో దోపిడీ తప్ప.. ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఆర్థిక మంత్రి పదవిని బుగ్గనకు అప్పగిస్తే.. ప్రజలపై పన్నుల భారం మోపారే తప్ప, చేసిన మేలు ఏమీ లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి ప్రజలపై అనేక భారాలు మోపిన ఘనత మంత్రి బుగ్గనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, దేవరబండ వెంకటనారాయణ, ఎస్ఎండీ రఫీ, రంజిత్ కిరణ్, వలసల బాలుడు, మిద్దెపల్లి గోవిందు, తాడూరు వెంకటరమణయ్య, నాగరాజు గౌడు, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్ పాల్గొన్నారు.

పెండేకంటి చేరికతో టీడీపీ బలోపేతం

సంజామల, మార్చి 31: బనగానపల్లె నియోజకవర్గంలోని సంజామల మండల వైసీపీ నాయకుడు పెండేకంటి కిరణ్‌కుమార్ టీడీపీలో చేరడంతో టీడీపీకి బలం పెరిగింది. మాజీ హోంశాఖమంత్రి, కర్నాటక, బీహార్ రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన సంజామల వాసి దివంగత పెండేకంటి వెంకటసుబ్బయ్య వారసుడు పెండేకంటి కిరణ్‌కుమార్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు. గతంలో టీడీపీలో సంజామల మండలంలో ఎదురులేని నాయకుడిగా బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉన్న పెండేకంటి కిరణ్‌కుమార్ వైసీపీ అధికారంలోకి వచ్చాక గతంలో వైసీపీలో చేరారు. ఎమ్మెల్యే కాటసాని తనకు సముచిత స్థానం కల్పించకపోవడం, తనవర్గానికి ఎలాంటి సంక్షేమ పథకాలు ఇప్పించుకోకపోవడంతో పెండేకంటి వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. ఆయన తండ్రి పెండేకంటి రఘురామయ్య కాంగ్రెస్ పార్టీలో జిల్లా స్థాయి పదవులు అలంకరించారు. ఆయన మృతి చెందడంతో అప్పటివరకు రాజకీయాలకు దూరంగా ఉండడంతో సన్నిహితులు పిలుపు మేరకు కిరణ్‌కుమార్ రాజకీయాల్లోకి వచ్చారు. తన పెద్దనాన్న డిల్లీ దాకా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. కిరణ్‌కుమార్ చేరికతో టీడీపీ బలోపేతం అయినట్లే అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మెగా డీఎస్సీపైనే తొలి సంతకం

డోన్, మార్చి 31: టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తానని యువతకు భరోసా ఇచ్చారని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. ఆదివారం పట్టణంలోని 25వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల నివేదిత మాట్లాడుతూ గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ మెగా డీఎస్సీ విడుదల చేస్తానని హామీ ఇచ్చి నిరుద్యోగ యువతను మోసం చేశారని ధ్వజమెత్తారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకపోగా.. ఎన్నికల ముందు తూతూ మంత్రంగా నోటిఫికేషన్లు విడుదల చేసి వైసీపీ ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, భాష్యం శ్రీధర్‌గౌడు, దిలీప్ రెడ్డి, ఎల్లాగౌడు, రవి, చాటకొండ రజిని, ఎన్ఈ సరోజ, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకుడు మల్లి పాల్గొన్నారు.

బీసీ విజయానికి కృషి చేస్తా : చల్లా విజయభాస్కర్‌రెడ్డి

అవుకు, మార్చి 31: బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే చల్లా రామకృష్ణారెడ్డి సోదరుడు టీడీపీ నాయకుడు చల్లా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అవుకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను తన బావమరిది కాశీపురం మొట్టరామిరెడ్డి చంద్రబాబు సమక్షంలో మార్చి 23న వైసీపీని వీడి టీడీపీలో చేరామన్నారు. తన సోదరుడు చల్లా రామకృష్ణారెడ్డికి రాజకీయాల్లో చివరి వరకు అండగా నిలిచామన్నారు. మొట్టరామిరెడ్డి పోద్బలం తో టీటీపీలో చేరినట్లు చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి చెప్పడం సరికాదన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి సేవా కార్యక్రమాలు, టీడీపీ విధానాలు నచ్చి స్వచ్ఛందంగా టీడీపీలో చేరామన్నారు.

టీడీపీతోనే బీసీల సాధికారత

చాగలమర్రి, మార్చి 31: టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా, బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసిందని అన్నారు. నిరుద్యోగ యువతకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. చంద్రబాబు హయాంలో బీసీ సబ్‌ప్లాన్ కింద రూ.40 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. బీసీ కుల వృత్తుల వారికి పనిముట్లను అందజేసి ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి భారీ షాక్

» మాజీ ఎమ్మెల్యే బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన 95 కుటుంబాలు

బనగానపల్లె, మార్చి 31: బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వివిధ గ్రామాలకు చెందిన 95 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 50 కుటుంబాలు బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో వైసీపీకి చెందిన చాగలమర్రి రామకృష్ణుడు, చాగలమర్రి రమణ, తుపాకుల ప్రసాద్, సుధాకర్ పోలంశేఖర్, కోవెలకుంట్ల ఆజాం, సూలం వెంకటేశ్వర్లు, ముల్లామాలి, ముల్లా మహమ్మద్ గౌస్, దోరాశి శ్రీను, కందుకూరు భాస్కర్‌రేవననూరు పెద్దహు సేన్‌సా, మర్రి చిన్న మద్దిలేటి, మదనగోపాల్, మద్దయ్య, షేక్ అబ్బాస్, ఈడిగ రామాంజనేయులు, చాకలి ఆంజనేయులు, ఈశ్వరయ్య, నరసింహులు, పెద్ద వలి, హుసేనప్ప, డొల్లు జంగమయ్య, గోపాల్ ఉన్నారు. బీసీ వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె వైసీపీకి చెందిన 25 కుటుంబాలు బనగానపల్లె టీడీపీ కార్యాల యంలో బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో వైసీపీకి చెందిన అంకెల బాస్కర్‌రెడ్డి, కోనశివశంకర్‌రెడ్డి, కోనభారతి, క్రిష్టిపాటి అరునాదేవి, మల్లికాదేవి, పుష్పావతి, వలి, సుకుర్‌భాష, మక్కల వెంకటరాముడు, గోగుల రామచంద్ర, మంజుల, బోయ వెంకటాంజనేయులు, గోగుల చంద్ర, ప్రభావతి,సిద్దయ్య, క్రిస్టిపాటి మద్దయ్య, బోయరఘురాం ఉన్నా రు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కలసికట్టుగా పనిచేసి సీఎంను చంద్రబాబు చేసుకుందామన్నారు. అలాగే బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేటకు చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. ఇల్లూరుకొత్తపేటకు చెందిన జూని యర్ జగన్, (సయ్యద్ చాంద్‌బాషా), అలహుసేన్, నాదలి,సుభాన్, జహంగీర్ బాషా, శివరమమూర్తి, లాలు, శ్రీను, పాంషావలి, బాషా, రహ్మతుల్లా, కార్పెంటర్ మహమ్మద్, వెల్డింగ్ ఖాశీం, సాయిబాబ, దొడియంఖాశీం, తలారి మధు, నగేంద్ర, దస్తగిరి తదితరులు పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారు మాట్లాడుతూ చంద్రబాబుసూపర్ సిక్స్ పథకాలతోనే ఏపీకి నిజమైన సంక్షేమం వస్తుందన్నారు. టీడీపీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పి స్తామని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు.



అవుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

నాపరాయి పరిశ్రమను నాశనం చేసిన జగన్ బీసీ

అవుకు: నాపరాయి పరిశ్రమను సీఎం జగన్ సర్వనాశనం చేశారని, నిరుద్యోగ యువతను వంచించి మోసం చేశారని బనగానపల్లె టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం అవుకు మండలం రామాపురం గ్రామంలో నిర్వహించిన సూపర్ సిక్స్ కార్యక్రమానికి వచ్చిన బీసీకి స్థానిక టీడీపీ జనసేన నాయకులు కార్యకర్తలు గ్రామప్రజలు ఘన స్వాగతం పలికారు. బీసీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని హయంలో రామాపురంలో రోడ్ల పరిస్థితి అత్యంత అధ్వానంగా తయారయ్యాయన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

రాష్ట్రంలో యువత నిరుద్యోగంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువతను వంచించి నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని జగన్‌పై మండిపడ్డారు. జగన్ నిర్వాకంతో దేశ వ్యాప్తంగా 11 శాతం నిరుద్యోగం ఉంటే ఏపీలో 24శాతం నిరుద్యోగం ఉందని అన్నారు. టీడీపీ రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మారిస్తే జగన్ రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చారని బీసీ విమర్శించారు. గతంలో ఎన్నికల హామీల్లో భాగంగా రాయల్టీ చెక్‌పోస్టును ఎత్తివేస్తామని చెప్పి కొట్టంలో ఉన్న చెక్‌పోస్టును బిల్డింగా మార్చి అధిక రాయల్టీని వసూలు చేస్తున్నారని అన్నారు. నాపరాయి పరిశ్రమకు గత టీడీపీ ప్రభుత్వంలో 1 చదరపు అడుగు రాయల్టీని రూ.8 నుంచి రూ. 5కు, అలాగే 30శాతం ఉన్న డీఎంఎఫ్ ను 10శాతం తగ్గించినట్లు తెలిపారు. ప్రస్తుతం సీఎం జగన్ ఒక చదరపు అడుగుకు రాయల్టీ రూ. 5 నుంచి రూ.6కు పెంచారని అన్నారు. అలాగే రూ.40 వేల ఉన్న ఒక హెక్టార్ డెడ్‌రెంట్‌ను రూ.52వేలకు పెంచినట్లు తెలిపారు. భారీ పరిశ్రమలకు పెట్టే కండీషన్లను చిన్నపరిశ్రమ అయిన నాపరాయి పరిశ్రమకు కూడా పెట్టారన్నారు. గనుల యజమానులు, కార్మికులు వైసీపీ విధానాలతో కుదేలయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవి పక్కీరారెడ్డి, ఉగ్రసేనారెడ్డి, ఎస్. రామకృష్ణారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, మారంపుల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్ర, పక్కీరగౌడ్, నారపురెడ్డి, శివరామిరెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళల ఆర్థిక స్వాలంబన

డోన్, మార్చి 31: టీడీపీతోనే మహిళల ఆర్థిక స్వాలంబన సాధ్యమవుతుందని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల చిత్రమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని గోసానిపల్లి గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రా లను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈసందర్భంగా కోట్ల చిత్రమ్మ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. నిరుద్యోగ యువతకు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

బేతంచెర్ల: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటీ హామీలు పథకాలు టీడీపీ అమలు చేస్తుందని డోన్ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మ అన్నారు. ఆదివారం నగర పంచాయతీలో 2, 9 కౌన్సిల్ వార్డులలో టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అధ్యక్షతన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు కేవీ సుబ్బారెడ్డి, వెంకటేశ్వర ఆచారి, రవీంద్ర నాయక్, షేక్ అబ్దుల్ సలాం, మండ్లవా నిపల్లి పల్లె మధుసూదన్, గుడివాడ క్రిష్ణమూర్తి, రుద్రవరం కృష్ణుడు, టైలర్ రాముడు, చింతకాయల విజయ్, ఎర్రమల మధు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

డోన్(రూరల్), మార్చి 31: తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు గుండాల ఈశ్వరయ్య మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గుండాల ఈశ్వరయ్య మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఇటీవల టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును కలిసి ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని కోరారన్నారు. స్పందించిన చంద్రబాబు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులికేశవయ్య, చిన్న రాయుడు, గోసానిపల్లి రామాంజనేయులు, సంజీవ్, మురళి పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పండి

కోవెలకుంట్ల, మార్చి 31: దళితుల సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించిన వైసీపీకి బుద్ధి చెప్పాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దేవరాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులను దళితులకు అందకుండా ఆ నిధులు పక్కదారి పట్టించి దళితులకు అన్యాయం చేసిన వైసీపీకి త్వరలో జరుగపోయే ఎన్నికల్లో బుద్ధి చెబుతామన్నారు.

పుట్టాలమ్మకు పూజలు

నంద్యాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మ అమ్మవారికి భక్తులు భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకొని పూజలు చేశారు. భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

సంజామల, మార్చి 31: ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించకుండా ఎలాంటి అనుమతి లేకుండా మోటారు సైకిల్‌కు వైసీపీ జెండా కట్టుకొని వెళ్తు న్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కడప జిల్లా పెద్దముడియం మండలం కల్వటాల గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి మోటారు సైకిల్‌కు జెండా కట్టుకొని వెళ్తుండగా తనిఖీ నిర్వహించి బైక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వలంటీర్ తొలగింపు

సంజామల, మార్చి 31: ఎన్నికల కమిషన్ ఆదేశాలను నిబంధనలను ఉల్లంఘించిన వలంటీర్ ఫరూక్‌ను తొలగించినట్లు ఎంపీడీవో నాగకుమార్ ఆదివారం తెలిపారు. ఇటీవల నంద్యాలలో జరిగిన సిద్ధం సభకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో పేరుసోముల గ్రామానికి చెందిన వలం టీర్ ఫరూక్ వైసీపీ కార్యకర్తలను సమీకరించి వారితోపాటు బస్సులో బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బనగానపల్లె ఆర్వో కామేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. విచారించిన ఆయన వలంటీర్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు వలంటీర్‌ను తొలగించినట్లు ఎంపీడీవో పేర్కొ న్నారు.

వ్యక్తిపై దాడి

ఉయ్యాలవాడ, మార్చి 31: మండలంలోని రూపనగుడి గ్రామానికి చెందిన కొమెర తిరుపతయ్యపై అదే గ్రామానికి చెందిన ఎద్దుల క్రిష్ణయ్య, కొమెర చిన్నవెంకటయ్య, శేషుగాళ్ల ఓబులేసులు కర్రలతో దాడి చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాత కక్షలు మనసులో పెట్టుకొని దాడి చేయటంతో తీవ్ర గాయాలయ్యాయి దీంతో ఫైముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఘనంగా ఈస్టర్ వేడుక

ఉయ్యాలవాడ, మార్చి 31: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఉయ్యాలవాడ, రూపనగుడి మాయలూరు. ఆర్.పాంపల్లె, కొండుపల్లె, హరివరం, అల్లూరు, కాకరవాడ, పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, సర్వాయిపల్లె తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు, యువతీ, యవకులు రంగులు చల్లుకొని సందడి చేశారు. ఉయ్యాలవాడ ఫాస్టేట్ చైర్మన్ జ్యోషి, హోసన్నా మందర్ పాస్టర్ రమేష్ ఆయా సంఘాల్లో ఈస్టర్ సందేశాన్ని అందించారు.

బనగానపల్లె: మండలంలోని గ్రామాల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చి, మధర్ థెరిస్సా చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల వద్ద ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంతోపాటు పలు గ్రామాలలో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారు జామునసే ఏసు తిరిగి లేవడంతో క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రంగులు చల్లుకున్నారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో ఆదివారం ఈస్టరు వేడుకను ఘనంగా నిర్వహించారు. రుద్రవరం, పెద్దకంబలూరు, కోటకొండ, ఆలమూరు, నరసాపురం, చందలూరు మందలూరు పేరూరు ఇంకా పలు గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టరు పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వసంతాలు చల్లుకుని సంబరాలు జరిపారు.

చాగలమర్రి: మండలంలోని గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కాలనీల్లో పిల్లలు, పెద్దలు, యువకులు రంగులు చల్లుకొని ఈస్టర్ వేడుకలను జరుపుకున్నారు. ముత్యాల పాడు, పెద్దబోదనం, మద్దూరు, పెద్దవంగలి, గొడిగనూరు, చాగలమర్రిలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈస్టర్ పండుగ గురించి ఫాదర్లు వివరించారు.



చాగలమర్రి ఎస్సీ కాలనీలో..



రుద్రవరం సీఎస్ఐ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



రూపనగుడిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

డోన్(రూరల్), మార్చి 31: వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని డోన్ కాంగ్రెస్ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మద్దిలేటి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకాలు తప్ప. రాష్ట్ర అభివృద్ధికై చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు జనార్దన్ యాదవ్, సునీత, సుబ్బు యాదవ్ పాల్గొన్నారు.

నవోదయలో డోన్ విద్యార్థిని ప్రతిభ

డోన్(రూరల్), మార్చి 31: నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో డోన్‌కు చెందిన విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. పట్టణంలోని కేవీఎస్ కాలనీకి చెందిన డి. ఇంద్రజ అనే విద్యార్థిని నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో 100/96 మార్కులు సాధించినట్లు తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, రాజేశ్వరి తెలిపారు.

ఏపీ సబ్‌కా అధ్యక్షుడిగా విజయకుమార్

రుద్రవరం, మార్చి 31: మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన శెట్టి విజయకుమార్‌ను స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు అసోసియేషన్ (ఏసీపీ డీసీపీ) సబ్‌కా నూతన అధ్యక్షుడిగా ఎన్నిక య్యారు. ఏప్రిల్ 1నుంచి అధ్యక్షుడుగా కొనసాగనున్నట్లు విజయ్‌కుమార్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

బేతంచెర్ల, మార్చి 31: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం లో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుండెకు సంబంధించిన వ్యాధులతోపాటు బీపీ, షుగర్ వంటి రోగాలకు వైద్యులు డా.గౌతమ్ చక్రవర్తి, యశ్వంత్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మోహన్‌రావు, జనా ర్ధన్, రాజేంద్రకుమార్, బచ్చు సుబ్రహ్మణ్యం, మారం విష్ణుమోహన్, శ్రీనివా సులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

అరటి చెట్లకు నిప్పు

రుద్రవరం, మార్చి 31: మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన కుడాల వెంకటపతి అలియాస్ మార్క్, వీఆర్ఏకు చెందిన రెండు ఎకరాల్లో అరటి చెట్లకు ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయాయి. దీంతో లక్ష నష్టం వాటిల్లిందని బోరున విలపించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ఉయ్యాలవాడ, మార్చి 31: మండలంలోని పుచ్చకాయపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారు జామున వాహనాల తనిఖీ చేపట్టారు. జమ్మలమడుగు నుంచి అక్రమ ఇసుక రవాణాతో వస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకపోవటంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

వెంగనపల్లె చెరువు పనులు ప్రారంభం



వెంగనపల్లె చెరువు తూముకు ఎస్కవేటర్‌తో మట్టి తోలుతున్న దృశ్యం

రుద్రవరం, మార్చి 31: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి రుద్రవరం మండలం వెంగనపల్లె చెరువు పనులను ఆదివారం ప్రారంభించారు. ఓట్ల కోసమే చెరువు పనులు చేపట్టారని రైతులు, టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇన్ని రోజులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నిస్తున్నారు. ఎంఐ ఏఈ మునాఫ్ మాట్లాడుతూ 2020లో టెండర్లు పిలిచారని, ఆ పనులను అప్పటి ఏఈ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. 2020లో 1.85 కోట్లతో జైకా నిధులతో టెండర్లు పిలిచామని, అందుకే మొదలు పెట్టామని అప్పటి ఎంఐ ఏఈ రఘు రాముడు తెలిపారు.

రంగాపురంలో విద్యుత్ అంతరాయం

బేతంచెర్ల, మార్చి 31: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో సోమ, మంగళవారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఏడీ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఏఈ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక గ్రామంలో జరుగుతున్న రోడ్డు విస్తరణలో భాగంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

'లింగమయ్య స్వామికి ప్రత్యేక పూజలు'

రుద్రవరం, మార్చి 31: మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : భూమా అఖిలప్రియ



చాగలమర్రిలో పర్యటిస్తున్న భూమా అఖిలప్రియ

చాగలమర్రి, మార్చి 31: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలోని చిన్నమకానం, శివాలయం వీధులలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 కరపత్రాలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్యను అధికార పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాగునీటి సమస్య ఉన్నా ఎమ్మెల్యే హోదాలో ఉండి పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందన్నారు. అక్రమ కేసులు, దాడులతోనే ఐదేళ్ల పాలన కొనసాగిందని, అభివృద్ధి గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, రఫిద్దీన్, శ్యాబా, బోలా బాషా పాల్గొన్నారు.

'నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు'

శిరివెళ్ల, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని శిరివెళ్ల సర్కిల్ సీఐ చంద్రబాబు హెచ్చరించారు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై యర్రగుంట్ల వద్ద శిరివెళ్ల ఎస్ఐ సురేష్, వీడియో సర్వెలైన్స్ టీం సభ్యులతో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమంగా తరలించే నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తీసుకెళ్తున్న వస్తువులు తదితర వాటిపై నిఘా పెంచామన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చాగలమర్రి: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమణయ్య హెచ్చరించారు. ఆదివారం చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేశారు. బిల్లులు లేకుండా నగదు తరలించకూడదన్నారు. నగదు, అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. గ్రామాల్లో పోలీసు 30 యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

రుద్రవరం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి డబ్బు, మద్యం ఇంకా పలురకాల వస్తువులు అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని సీఐ చంద్రబాబు హెచ్చరించారు. మండలంలోని నల్లవాగుపల్లె మెట్ట సమీపంలో ఆళ్లగడ్డ, అహోబిళం రహదారిలో ఆదివారం వాహనాలను తనిఖీ చేపట్టారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.



యర్రగుంట్ల వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు